
RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:65 | ఫిబ్రవరి 15, 2026 | వెల: రూ.3-00




## శివోహం!

### నేడు మహాశివ రాత్రి పర్వం

- ముస్తాబైన శైవాలయాలు
- ఈసారి వేములవాడ భీమన్న ఆలయంలో వేడుకలు
- భక్తుల కోసం భారీగా ఏర్పాట్లు
- ప్రధాన సెంటర్ల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు



2లో




### పట్టణాల్లో చతికిలపడ్డ బీఆర్ఎస్

- ఒక్క కార్పొరేషన్లో కూడా ఎగరని గులాబీ జెండా
- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభావం అంతంతే
- కేవలం 13 మున్సిపాలిటీల్లోనే మెజార్టీ
- అందరినీ విస్మయానికి గురిచేసిన ఫలితాలు
- స్థానిక నాయకత్వ లోపమే కారణమా?
- కేటీఆర్, హరీశ్ రావు తప్ప కనిపించని పెద్ద నేతలు
- లైట్ తీసుకోవడం వల్లే మున్సిపల్ ఫలితం
- నైరాశ్యంలో ద్వితీయ శ్రేణి నాయకత్వం, క్యాడర్
- ఇలాగే ఉంటే గ్రేటర్ ఎన్నికల్లోనూ కోలుకోలేని దెబ్బ
- గులాబీ బాస్ ముందుకొస్తేనే పార్టీ మళ్లీ గాడిలోకి..
- లేకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ చుక్కెదురే అంటున్న విశ్లేషకులు

### గులాబీ కంచుకోటకు బీటలు

### కరీంనగర్ కార్పొరేషన్లో కాషాయ జెండా రెపరెపలు

2లో

# కారు.. బేజారు!

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

ఒకప్పుడు తెలంగాణ రాజకీయ యవనికపై తిరుగులేని శక్తిగా వెలుగొందిన భారత రాష్ట్ర సమితి పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. పట్టణాల్లో మాదే పట్టు అన్న గులాబీ నేతల వ్యాఖ్యలను నీటిమూటలు చేస్తూ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఆ పార్టీ పునాదులను కదిలించాయి. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 13 మున్సిపాలిటీలకే పరిమితమై, ఒక్కటంటే ఒక్క కార్పొరేషన్ పీఠాన్ని కూడా దక్కించుకోలేకపోవడంతో పట్టణ ఓటర్లు కారు పార్టీని పూర్తిగా తిరస్కరించినట్లైంది. ఉద్యమానికి కేంద్రబిందువైన ఉత్తర తెలంగాణలో, ముఖ్యంగా కంచుకోట లాంటి కరీంనగర్ గడ్డపై కారు జోరుకు బ్రేకులు పడటం విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేస్తోంది. గులాబీ బాస్ కేసీఆర్ మౌనం, సీనియర్ నేతల నిర్లక్ష్యం వెరసి... క్యాడర్ తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోగా, ఈ ఫలితాలు రాబోయే గ్రేటర్ ఎన్నికలకు, 2028 అసెంబ్లీ పోరుకు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయన్న ఆందోళన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

### కాంగ్రెస్ ప్రభుత్వం బలమైనది కాదు

### కార్పొరేటర్లను ఎత్తుకెళ్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుంది

- బండి సంజయ్ ఒక వారియర్
- ఆయన అర్జునుడి పాత్రకు సరిపోతారు
- నిజామాబాద్ ఫలితాల్లో బీజేపీ ఆధిక్యం
- రేవంత్ ప్రభుత్వంపై ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శలు

2లో

### సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వడ్డేపల్లి కౌన్సిలర్లు

- శ్రీనివాస్ నేతృత్వంలో మర్యాదపూర్వక భేటీ
- పీసీసీ అధ్యక్షుడు, మంత్రి, ఎంపీ తదితరుల హాజరు
- ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్ల సమావేశం

2లో

# కాంగ్రెస్ విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసింది



- అయినా ఆశించిన ఫలితాలు రాలేదు
- బీఆర్ఎస్ గట్టి పోరాటం చేసి అద్భుతంగా నిలిచింది
- హంగ్ మున్సిపాలిటీల్లోనూ అవకాశాలున్నాయి
- ఫార్ములా-ఈ అంశాన్ని మరోసారి ప్రభుత్వం తెరపైకి తెస్తోంది.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో

# పురపోరులో పొంగులేటి మార్క్!

### 10 రోజుల్లో.. 249 వార్డుల్లో ప్రచారం

- 70 శాతం సక్సెస్ రేటుతో 174 వార్డుల్లో గెలుపు
- శీనన్న వ్యూహంతో ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ పురపాలికల్లో హస్తం ప్రభంజనం



2లో

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికలలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక అజేయ శక్తిగా ఎదిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించిన బాధ్యతను సవాలుగా తీసుకున్న ఆయన, తన వ్యూహ చతురతతో ఫలితాలను తలకిందులు చేశారు. కేవలం 10 రోజుల్లోనే 249 వార్డుల్లో సుడిగాలి పర్యటనలు సాగించి, అసాధ్యమనుకున్న సమీకరణాలను సుసాధ్యం చేశారు. ప్రచారం నిర్వహించిన స్థానాల్లో ఏకంగా 174 వార్డులను (సుమారు 70 శాతం సక్సెస్ రేటు) కాంగ్రెస్ ఖాతాలో వేసి, రాష్ట్ర రాజకీయాల్లో 'మోస్ట్ సక్సెస్‌ఫుల్ లీడర్'గా నిలిచారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తన 'అడ్డా'ను కాపాడుకోవడమే కాకుండా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రత్యర్థుల కోటలను బద్దలు కొట్టి హస్తం ప్రభంజనాన్ని చాటారు. శీనన్న అడుగుపెట్టిన ప్రతిచోటా విజయం వరించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# కాంగ్రెస్ విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసింది

- అయినా ఆశించిన ఫలితాలు రాలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. వచ్చిన ఫలితాలతో కాంగ్రెస్ పార్టీ అసంతృప్తిగానే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. వారు ఆశించినన్ని స్థానాలు రాలేదని పేర్కొన్నారు. తమ పార్టీ కార్యకర్తలు గట్టి పోరాటం చేసి అద్భుతంగా నిలిచారని తెలిపారు. మొత్తం 30కి పైగా మున్సిపాలిటీలు వస్తాయని భావించినప్పటికీ, వచ్చిన 17 మున్సిపాలిటీలతో పాటు హంగ్ ఏర్పడిన ప్రాంతాల్లో కూడా తమకు విజయావకాశాలు ఉన్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ తమ ప్రదర్శన బాగుందని చెప్పుకోవడం అర్థం కావడం లేదని కేటీఆర్ విమర్శించారు. గతంతో పోలిస్తే వారికి తక్కువ ఓట్లు, తక్కువ వార్డులు వచ్చాయని అన్నారు. జాతీయ అధ్యక్షుడిని తెచ్చి ప్రచారం చేసినా ఒక్క మున్సిపాలిటీ కూడా గెలవలేకపోయారని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లోకల్ అంశాలే కీలకమని, అధికారంలో ఉన్నవారికి సాధారణంగా అనుకూల పరిస్థితులు ఉంటాయని పేర్కొన్నారు. డబ్బు ప్రభావం విపరీతంగా పెరిగిందని, కాంగ్రెస్ విచ్చలవిడిగా ఖర్చు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్ని స్థానాలు గెలిచిందో అందరికీ తెలుసని ఆయన గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గతంలో కాంగ్రెస్ పరిస్థితి ఏంటో ప్రజలు గుర్తుంచుకున్నారని అన్నారు. ఫలితాలు ఆశించినంతగా రాని జిల్లాల్లోనూ పార్టీ శ్రేణులు గట్టిగా పోరాడాయని, ఈ ఎన్నికలు తమకు సంతృప్తికరమైనవేనని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత విమర్శలు చేసిన వారికి ఈ ఫలితాలే సమాధానమని వ్యాఖ్యానించారు. ఎక్స్ అఫీషియో సభ్యుల నిబంధనల విషయంలో ప్రభుత్వానికే స్పష్టత లేదని కేటీఆర్ అన్నారు. ఫార్ములా-ఈ అంశాన్ని మరోసారి ప్రభుత్వం తెరపైకి తీసుకువస్తోందని, ఇప్పటికే పలుమార్లు విచారణకు పిలిచినా ఏమీ తేలలేదని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం బలమైనది కాదు

- రేవంత్ ప్రభుత్వంపై ధర్మపురి అరవింద్ విమర్శలు

**వేద న్యూస్, నిజామాబాద్**

రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వం కాదని, సీఎం రేవంత్ రెడ్డి బలమైన స్థాయిలో లేరని ఎంపీ ధర్మపురి అరవింద్ హాట్ కామెంట్స్ చేశారు. నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఎంపీ ధర్మపురి అరవింద్ రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ ఒక వారియర్ అని, ఆయన అర్జునుడి పాత్రకు సరిపోతారని అభిప్రాయపడ్డారు. మున్సిపల్ వార్డు సభ్యులు, కార్పొరేటర్లను బలవంతంగా ఎత్తుకెళ్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు ఇప్పటికే ఛీకొడుతున్నారని, కార్పొరేటర్లను ఎత్తుకెళ్లే ప్రయత్నాలు చేస్తే మరింత ప్రతికూలత ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ కార్పొరేషన్ ఫలితాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే ఎక్కువ స్థానాలు బీజేపీ గెలుచుకుందని తెలిపారు. తన పార్లమెంట్ పరిధిలో కూడా బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లు సాధించామని వెల్లడించారు. కాంగ్రెస్ లౌకిక వాద పార్టీ కాదని, ఓ బ్రోకర్ పార్టీగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని అరవింద్ ఆరోపించారు. రాజకీయాల్లో హుందాతనం అవసరమని, ఎవరికి మద్దతు ఇవ్వాలనేది కార్పొరేటర్ల స్వేచ్ఛ అని అన్నారు. బలవంతపు రాజకీయాలు సరికాదని హెచ్చరించారు. కరీంనగర్‌లో బండి సంజయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటిందని ప్రశంసించారు.

# చిన్న పత్రికలపై వివక్ష తగదు

- ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకూ అక్రెడిటేషన్ ఇవ్వాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య
- 17న 'ఛలో సమాచార భవన్'కు పిలుపు

**వేద న్యూస్, హైదరాబాద్**



ఆర్ఎన్ఐ, పీఆర్‌జీఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు ఎంప్యానల్‌మెంట్‌తో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం 17న హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని సమాచార భవన్ ఎదుట ఛలో సమాచార భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 44 వేలకుపైగా అక్రెడిటేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించినప్పటికీ, ఎంప్యానల్‌లో ఉన్న కొన్ని పత్రికలు, చానళ్లకే పరిమితం చేయడం వల్ల చిన్న, మధ్య తరహా పత్రికలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న పత్రికలకు సర్క్యులేషన్ ఆధారంగా అక్రెడిటేషన్ ఇచ్చేవారని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎంప్యానల్ నిబంధనల పేరుతో చిన్న పత్రికలను పక్కనబెట్టారని, దీనివల్ల జర్నలిస్టుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంప్యానల్ జాబితాలో ఉన్న పత్రికలను తొలగించడం కూడా ఆందోళన కలిగించే విషయమన్నారు. ప్రభుత్వం వెంటనే పునరాలోచించి ఆర్ఎన్ఐ, పీఆర్‌జీఐ గుర్తింపు ఉన్న ప్రతి పత్రికకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని, ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా కనీసం నెలకు ఒక ప్రకటన ఇవ్వాలని కోరారు. అదేవిధంగా జర్నలిస్టులకు ఉచిత బస్ పాస్, హెల్త్ కార్డులు, భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పత్రికల నిర్వాహకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు.

# కారు.. బేజారు!




**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలుగొందిన భారత రాష్ట్ర సమితి పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా తయారైంది. తాజాగా వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు గులాబీ పార్టీ పునాదులను కదిలించాయనే చెప్పాలి. పట్టణ ప్రాంత ఓటర్లు కారు పార్టీకి షాక్ ఇవ్వగా, కంచుకోటలుగా భావించే ఉత్తర తెలంగాణ జిల్లాల్లోనూ పార్టీ చతికిలపడటం రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేస్తోంది. పట్టణాల్లో మాదే పట్టు.. అని గొప్పగా చెప్పుకున్న బీఆర్ఎస్ నేతల మాటలు నీటిమూటలయ్యాయి.

### పట్టణ ఓటర్ల తిరస్కారం..

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పురపాలక ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రదర్శన అత్యంత పేళవంగా నమోదైంది. మొత్తం 116 మున్సిపాలిటీల్లో కేవలం 13 మున్సిపాలిటీల్లో మాత్రమే ఆ పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించగలిగింది. మిగిలిన చోట్ల ప్రధాన ప్రతిపక్షంగా నిలబడటం అటుంచితే, కనీసం పోటీ ఇవ్వలేక చతికిలపడింది. ఇక నగరపాలక సంస్థల విషయానికి వస్తే పరిస్థితి మరీ దారుణం. ఒక్కటంటే ఒక్క కార్పొరేషన్ పీఠాన్ని కూడా కైవసం చేసుకోలేకపోయింది. పట్టణ ఓటర్లు పూర్తిగా అధికార కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని, లేదంటే కొన్ని చోట్ల బీజేపీకి ప్రత్యామ్నాయంగా చూశారని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

### కంచుకోట బద్దలు..

బీఆర్ఎస్ ఆవిర్భావానికి, ఉద్యమ ప్రస్థానానికి కేంద్ర బిందువుగా నిలిచిన ఉత్తర తెలంగాణలో ఫలితాలు ఆ పార్టీ శ్రేణులను జీర్ణించుకోలేకుండా చేస్తున్నాయి. గులాబీ పార్టీకి కంచుకోటగా పిలవబడే కరీంనగర్ గడ్డపై కారు జోరుకు బ్రేకులు పడ్డాయి. కరీంనగర్ కార్పొరేషన్లో మొత్తం 66 డివిజన్లు ఉండగా, బీఆర్ఎస్ కేవలం 9 స్థానాలకే పరిమితం కావడం పార్టీ దుస్థితికి అద్దం పడుతోంది. మరోవైపు బీజేపీ ఇక్కడ అనూహ్యంగా పుంజుకుని కాషాయ జెండాను రెపరెపలాడించింది. ఉత్తర తెలంగాణలోని అనేక మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు మూడో, నాలుగో స్థానాలకు పడిపోయారు. ఉద్యమ కాలం నుంచి అండగా ఉన్న ప్రజలు ఇప్పుడు ముఖం చాటేయడం ఆ పార్టీ నాయకత్వ లోపాన్ని ఎత్తిచూపుతోంది.

### నాయకత్వ లోపం.. బాస్ మౌనం

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ వైఫల్యానికి ప్రధాన కారణం స్పష్టమైన నాయకత్వ లోపం అని విశ్లేషకులు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ అధినేత, గులాబీ బాస్ కేసీఆర్ ప్రజల్లోకి రాకపోవడం, ఈ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పూర్తిగా దూరంగా ఉండటం పార్టీని కోలుకోలేని దెబ్బతీసింది. బాస్ వస్తే సీన్ మారుతుంది అని నమ్మిన క్యాడర్, ఆయన రాకపోయేసరికి డీలా పడిపోయింది.

### పట్టించుకోని సీనియర్ నేతలు

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేసినా, హరీశ్ రావు అడపాదడపా ప్రచారంలో మెరిసినా.. అది ఓట్ల వర్షం కురిపించలేకపోయింది. వీరిద్దరు మినహా మిగతా సీనియర్ నేతలు, మాజీ మంత్రులు ప్రచారాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. క్షేత్రస్థాయిలో పార్టీని నడిపించే బలమైన స్థానిక నాయకత్వం కరువైంది. పాత ముఖాలే మళ్లీ కనిపించడం, కొత్త రక్తం లేకపోవడం ఓటర్లలో ఆసక్తిని తగ్గించింది.

### నైరాశ్యంలో క్యాడర్..

వరుస ఓటములతో బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోయారు. తమ భవిష్యత్తు ఏంటన్న ఆందోళన వారిలో మొదలైంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌ను ప్రయోగిస్తుండటంతో, చాలా మంది బీఆర్ఎస్ నేతలు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు కండువా మార్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే గెలిచిన కొద్దిపాటి కౌన్సిలర్లను కాపాడుకోవడం బీఆర్ఎస్ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారింది.

### ముందుంది గ్రేటర్ గండం..

ఈ మున్సిపల్ ఫలితాలు రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. పట్టణ ఓటర్లు బీఆర్ఎస్‌కు దూరమవుతున్నారని స్పష్టమైన సంకేతాలు వెలువడ్డాయి. ఇదే పరిస్థితి కొనసాగితే హైదరాబాద్‌పై ఉన్న పట్టు కూడా కోల్పోవాల్సి వస్తుందని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా, 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ కోలుకోవడం కష్టమనే ప్రచారం రాజకీయ వర్గాల్లో మొదలైంది. ఇప్పటికైనా అగ్ర నాయకత్వం ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి, ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుని, గ్రామ, పట్టణ స్థాయి కమిటీలను ప్రక్షాళన చేయకపోతే.. వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ పార్టీకే ప్రజలు పట్టం కట్టడం ఖాయమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**పట్టణాల్లో చతికిలపడ్డ బీఆర్ఎస్..**
**గులాబీ కంచుకోటకు బీటలు**
**కరీంనగర్ కార్పొరేషన్లో కాషాయ జెండా రెపరెపలు**

- ఒక్క కార్పొరేషన్లో కూడా ఎగరని గులాబీ జెండా
- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభావం అంతంతే
- కేవలం 13 మున్సిపాలిటీల్లోనే మెజార్టీ
- అందరినీ విస్మయానికి గురిచేసిన ఫలితాలు
- స్థానిక నాయకత్వ లోపమే కారణమా?
- కేటీఆర్, హరీశ్ రావు తప్ప కనిపించని పెద్ద నేతలు
- లైట్ తీసుకోవడం వల్లే ఈ ఫలితాలు
- నైరాశ్యంలో ద్వితీయ శ్రేణి నాయకత్వం, క్యాడర్
- ఇలాగే ఉంటే గ్రేటర్ ఎన్నికల్లోనూ కోలుకోలేని దెబ్బ
- గులాబీ బాస్ ముందుకొస్తేనే పార్టీ గాడిలోకి..
- లేకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ చుక్కెదురే అంటున్న విశ్లేషకులు

# పురపోరులో పొంగులేటి మార్క్!

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి**



మున్సిపల్ ఎన్నికల కురుక్షేత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక అజేయ శక్తిగా నిలిచారు. ముఖ్యమంత్రి రేవంతన్న అప్పగించిన బాధ్యతను సవాలుగా తీసుకున్న ఆయన, తన వ్యూహ చతురతతో ఫలితాలను తలకిందులు చేశారు. కేవలం అంకెలే కాదు.. ఆ అంకెల వెనుక ఉన్న ఆయన కష్టం, ప్రచారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం 10 రోజుల్లోనే అసాధ్యమనుకున్న సమీకరణాలను సుసాధ్యం చేసి చూపారు.

### శీనన్న అడ్డాలో తిరుగులేని హవా!

తన సొంత గడ్డపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గాలివాటం కాదు.. సునామీ సృష్టించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆయన అడుగుపెట్టిన ప్రతిచోటా కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. ఏదులాపురంలోని 32 వార్డుల్లో ఏకంగా 24 చోట్ల జయకేతనం ఎగురవేసి సత్తా చాటారు. కొత్తగూడెం కార్పొరేషన్లో 22 స్థానాలను కైవసం చేసుకున్నారు. కల్లూరులో 12, సత్తుపల్లిలో 17 వార్డులను హస్తం ఖాతాలో వేశారు. ఇల్లందులో 19, అశ్వారావుపేటలో 17 స్థానాల్లో గెలిచి తన పట్టును నిరూపించుకున్నారు.

### ఓరుగల్లు కోటపై హస్తం జైత్రయాత్ర!

రేవంతన్న ఆశీస్సులతో ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యతలను స్వీకరించిన శీనన్న, అక్కడ కూడా ప్రత్యర్థుల కోటలను బద్దలు కొట్టారు. అత్యంత కీలకమైన భూపాలపల్లి మున్సిపాలిటీలో 16 వార్డులను గెలుచుకుని పట్టు సాధించారు. పరకాలలో 13, స్టేషన్ ఘన్‌పూర్‌లో 13 స్థానాలను గెలిపించి జిల్లాలో కాంగ్రెస్ ప్రాభవాన్ని చాటారు.

**10 రోజుల్లో.. 249 వార్డుల్లో ప్రచారం**
**70 శాతం సక్సెస్ రేటుతో 174 వార్డుల్లో గెలుపు**
**శీనన్న వ్యూహంతో ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ పురపాలికల్లో హస్తం ప్రభంజనం!**

### గణాంకాలే సాక్ష్యం..

మొత్తంగా మంత్రి పొంగులేటి ప్రచారం నిర్వహించిన 249 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ 174 స్థానాలను గెలుచుకుంది. అంటే సుమారు 70 శాతం గెలుపు రేటుతో ఆయన మోస్ట్ సక్సెస్‌ఫుల్ లీడర్‌గా నిలిచారు. పగలు రేయి ఏకంచేసి ఆయన సాగించిన సుడిగాలి పర్యటనలు, రేవంతన్న సంక్షేమ పథకాలపై ప్రజలకు కల్పించిన భరోసా ఓట్ల వర్షంగా కురిసింది. మాట ఇస్తే తప్పని నైజంతో, అభివృద్ధిపై ఉన్న నిబద్ధతతో శీనన్న ప్రజాప్రభుత్వంలో తన మార్క్ రాజకీయాలను మరోసారి చాటిచెప్పారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వడ్డేపల్లి కౌన్సిలర్లు



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ కు చెందిన 8 మంది కౌన్సిలర్లు సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తదితరులు హాజరయ్యారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై చర్చించినట్లు సమాచారం. సీఎంను కలిసిన వడ్డేపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లలో కుర్వ పావని (1వ వార్డు), శారద (2వ వార్డు), మంజుల (4వ వార్డు), యుగేందర్ రెడ్డి (5వ వార్డు), దేవమ్మ (6వ వార్డు), విజయ్ భాస్కర్ (7వ వార్డు), జయశ్రీ (8వ వార్డు), ఎరుకల తిమ్మప్ప (10వ వార్డు) ఉన్నారు. జిల్లా అభివృద్ధి, మున్సిపల్ సమస్యల పరిష్కారం, ప్రజా అవసరాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశం సానుకూల వాతావరణంలో ముగిసినట్లు వర్గాలు పేర్కొన్నాయి.

# నేడు మహాశివ రాత్రి

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఓం నమః శివాయ అన్న పంచాక్షరీ మంత్రంతో శైవాలయాలు మార్మోగనున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ, పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ఆదివారం పండుగ రావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఈసారి ప్రధాన ఆలయంలో మరమ్మతు పనులు జరుగుతుండటంతో, చరిత్రలో తొలిసారిగా భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి జాతరను నిర్వహిస్తున్నారు. మేడ్చల్లోనని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. మెదక్ ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయంలో మూడు రోజుల పాటు భారీ జాతర జరగనుంది.. ఇక్కడ గోదావరి నది ఏడు పాయలుగా చీలి ప్రవహించడం విశేషం. జయశంకర్ భూపాలపల్లిలోని త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా జరగనున్నాయి. వరంగల్ రామప్ప ఆలయం, కొమురవెల్లి మల్లన్న క్షేత్రం తదితర ప్రముఖ ఆలయాలన్నీ వేడకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.

### భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఆర్టీసీ శివరాత్రి కోసం రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు.

- ముస్తాబైన శైవాలయాలు
- ఈసారి వేములవాడ భీమన్న ఆలయంలో వేడుకలు
- భక్తుల కోసం భారీగా ఏర్పాట్లు
- ప్రధాన సెంటర్ల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు



ముఖ్యంగా హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడ, కీసరగుట్టకు ఎక్కువ సర్వీసులు కేటాయించారు. భక్తులు గంటల తరబడి వేచి ఉండకుండా ప్రత్యేక క్యూ లైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని మంచినీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. రద్దీ ఎక్కువగా ఉండే ఆలయాల వద్ద 24 గంటల పాటు వైద్య బృందాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వేలాది మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. కీసరగుట్ట వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఆంక్షలు విధించారు. ఆలయ పరిసరాల్లో నిరంతర పారిశుధ్య నిర్వహణ కోసం అదనపు సిబ్బందిని నియమించారు.

వేద న్యూస్

ఆదివారం ఫిబ్రవరి 15, 2026



వేద న్యూస్ తెలుగు దినపత్రిక –2026 క్యాలెండర్ ను శనివారం ఆవిష్కరిస్తున్న కాట్నపల్లి గ్రామ సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్, వేద న్యూస్ సీనియర్ జర్నలిస్టు అంబీర్ శ్రీకాంత్ తదితరులు

## యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన యశోద హాస్పిటల్ వైద్యులచే ఈ నెల 18, 25 తేదీలలో ఉచిత కంటి ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు సూర్యాపేట లయన్స్ క్లబ్ చైర్మన్ మిర్యాల సుధాకర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్యులు ఎలాంటి ఫీజు లేకుండా రోగులను పరిశీలించి అవసరమైన సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. అలాగే ఈ నెల 25న సూర్యాపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ కూడా నిర్వహించి పలు వ్యాధులకు సంబంధించిన ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు, అవసరం ఉన్నవారు ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిర్యాల సుధాకర్ కోరారు.

## కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ కౌన్సిలర్లు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ మున్సిపాలిటీకి చెందిన బీజేపీ కౌన్సిలర్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కరీంనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణతో పాటు కౌన్సిలర్లు కుమ్మరి శంకర్, వంగల శ్రీనివాస్, కొండ్లెపు ముత్యం, టైలర్ శ్రీనివాస్, బోనాల సాగరిక, మామిండ్ల అమర్, రేగుల రేణుక పాల్గొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కౌన్సిలర్లను అభినందించి, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై సూచనలు చేసినట్లు తెలిపారు.

## మద్యం దుకాణాలు బంద్

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



మహాశివరాత్రి జాతర ఉత్సవాల నేపథ్యంలో వేములవాడలో మద్యం దుకాణాలను తాత్కాలికంగా మూసివేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని రెండు కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని మద్యం, కల్లు దుకాణాలను ఈ నెల 14వ తేదీ శనివారం రాత్రి 10 గంటల నుంచి 16వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల వరకు మూసి ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జాతర సందర్భంగా శాంతిభద్రతలు, ఆధ్యాత్మిక వాతావరణం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## భీమన్నకు పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి పొన్నం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ భీమేశ్వరస్వామికి మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. నేడు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం 8 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.

## వేములవాడలో పోలీసుల ఆంక్షలు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ పట్టణంలో పోలీసులు ఆంక్షలను అమలు చేస్తు న్నారు. జాతర బందోబస్తులో భాగంగా భీమేశ్వర స్వామి ఆలయం, బద్దిపోచమ్మ దేవాలయం పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ పలుచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బందిని మోహరించారు. జాతర సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే ఆలయ సిబ్బంది, మీడియా ప్రతినిధుల వాహనాలకు అనుమతి ఇవ్వకుండా, కొన్ని వాహనాలకు అనుమతి ఇవ్వడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# మహాశివరాత్రికి సర్వం సిద్ధం

- రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- 1300 సంవత్సరాల ప్రాచీన ఆలయంగా విశేష గుర్తింపు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలోని ప్రసిద్ధ పార్వతీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు దేవాలయ చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్ తెలిపారు. సుమారు 1300 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ప్రాచీన దేవాలయం ఆధ్యాత్మిక, శాస్త్రీయ విశిష్టతతో కూడిన మహా పుణ్యక్షేత్రంగా పేరుగాంచింది. సంవత్సరంలోని 365 రోజులు సూర్యాస్తమ సమయంలో స్వామివారిపై నేరుగా సూర్యకిరణాలు పడే విధంగా నిర్మితమైన అరుదైన ఆలయంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామివారికి విశేష అలంకరణ, అభిషేకాలు, రుద్రాభిషేకాలు, మహాపూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రెంటాల సతీష్ శర్మ, మనీశర్మ తెలిపారు. స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహిస్తే సకల అపమృత్యు దోషాలు తొలగి విశేష ఫలితాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5 గంటలకు ప్రథమాభిషేకం, ఉదయం 9 గంటలకు మహాపుష్పార్చన, ఉదయం 10 గంటలకు గ్రామ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రెండు రోజులపాటు రాజమండ్రి కళాకారులచే గ్రామోత్సవ మహాసేవ కార్యక్రమాలు జరుగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని దేవాలయ చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్ కోరారు.

# డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తికి సన్మానం

- భక్త రామదాసు ప్రెస్ క్లబ్ సభ్యుల అభినందనలు

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తిని భక్త రామదాసు ప్రెస్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. నూతనంగా ప్రారంభించిన ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఆయనను స్వాగతించి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ డా. దివ్యమూర్తి తన ప్రతిభతో అనేకమంది విద్యార్థులు, ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని, ఆయన సేవలను గుర్తిస్తూ ఈ సన్మానం నిర్వహించినట్లు తెలిపారు. సన్మానానికి స్పందించిన డా. దివ్యమూర్తి మాట్లాడుతూ ఈ గౌరవం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఇప్పటివరకు 119 వేదికలపై సన్మానం పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎల్లుట్ల సైదులు, ఉపాధ్యక్షుడు పంబ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దుడ్డెల సంజయ్, కోశాధికారి తూటిపల్లి వీరభద్రం, సభ్యులు అవుట మధు, విజయ్ దళపతి, పంబ రవి, నంద్యాల శివాజీ, యడవల్లి సైదులు, కే సద్గుణ్, ప్రసాద్, కుక్కల తిరుపతిరావు, జాతీయ అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నీడలో మహాశివరాత్రి జాతర

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడలో మహాశివరాత్రి జాతర సందర్భంగా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. భీమేశ్వర స్వామి ఆలయం, బద్దిపోచమ్మ ఆలయం పరిసరాలతో పాటు పట్టణంలోని ముఖ్య ప్రాంతాల్లో 175 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచుతున్నారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్ ప్రాంతాలు, క్యూ లైన్లు, భక్తులు సంచరించే ప్రాంతాలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శనివారం సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. జాతర సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

# రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి



- సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే.ఎస్. శ్రీనివాస్ రాజ్
- ఆలయంలో ప్రత్యేక పూజలు
- ఉచిత ఆర్టీసీ బస్సు సేవల ప్రారంభం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే.ఎస్. శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. వేములవాడకు విచ్చేసిన ఆయనకు ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదం అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే.ఎస్. శ్రీనివాస్ రాజ్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి పరిశీలించారు. పనులకు సంబంధించిన ఫోటోలు, వివరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రాజన్న ఆలయ విస్తరణ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని, పనుల్లో వేగం పెంచడంతో పాటు అవసరమైన సిబ్బంది సంఖ్యను పెంచాలని అధికారులకు సూచించారు. పనుల నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలి

జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆలయ విస్తరణ, బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరాలు సమీక్షించారు. నూతన గోశాల నిర్మాణం, పశువుల సంరక్షణ తదితర అంశాలపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం వరకు ఉచితంగా నడిచే ఆర్టీసీ బస్సులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వర్, ఎస్ఈ రాములు, ఈఈ నరసింహాచారి, ఆలయ ఈఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన మేస్త్రి పోశెట్టి (కుర్మ) ఆకస్మిక మరణం పట్ల మేస్త్రి సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సంఘం తరఫున రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మేస్త్రి సంఘం అధ్యక్షుడు ముద్దసాని రాజు మాట్లాడుతూ.. పోశెట్టి మేస్త్రి యూనియన్‌లో కోశాధికారిగా పనిచేసి సంఘానికి విశేష సేవలు అందించినట్లు తెలిపారు. ఆయన మృతి సంఘానికి తీరని లోటని పేర్కొంటూ, పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేస్త్రి సంఘం నాయకులు బైండ్ల సంజీవ్, సాయిలు, గంగారాం, పిట్ల సుధాకర్, లింగం, పోతారాజు లింగం తదితరులు పాల్గొన్నారు

వేద న్యూస్

ఆదివారం ఫిబ్రవరి 15, 2026

# క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు

**- గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలి**
**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**వేద న్యూస్, మంచిర్యాల:**

క్రీడల ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలు, టీం వర్క్ భావన పెంపొందుతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో నిర్వహిస్తున్న సీఎం కప్-2025 జిల్లా స్థాయి పోటీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామీణ స్థాయి నుంచి యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడటంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. క్రీడలలో రాణిస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొనగా, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్, రోలర్ స్కేటింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, సైక్లింగ్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, సంబంధిత అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్‌ను సస్పెండ్ చేయాలి



**- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పరశురాములు**

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి విధ్వనిష్ తీవ్రంగా గాయపడిన ఘటనపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల పరశురాములు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఈ ఘటనకు బాధ్యురాలిగా భావిస్తున్న అంగన్‌వాడీ టీచర్ రాణిని వెంటనే సస్పెండ్ చేసి, పూర్తి స్థాయి విచారణ జరిపి నిజానిజాలు వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. బాధిత చిన్నారికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు కుటుంబానికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో కట్టుదిట్టమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మ్యాకల పరశురాములు, చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని కుటుంబానికి ధైర్యం చెప్పారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

# ఓటమి అభ్యర్థులను పరామర్శించిన యువనేత సిద్ధార్థ

**వేద న్యూస్, దామరచర్ల:**



ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను యువనేత సిద్ధార్థ శనివారం పరామర్శించారు. గెలుపు అంచున ఆగిపోయిన అభ్యర్థుల నివాసాలకు వెళ్లి వారిలో ధైర్యం నింపారు. అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ఒక ఓటమితో నిరుత్సాహపడకుండా ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజా సేవే బీఆర్ఎస్ కార్యకర్తల లక్ష్యమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి నమ్మకాన్ని తిరిగి గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డి. నారాయణరెడ్డి, బి. సంపత్, పల్నాటి జానకి రెడ్డి, అంజి, బూర సైదులు, క్రాంతి, తుమ్మల ఫణి కుమార్, ఎం.డి. షోయబ్, కె. వినోద్ కుమార్, ఆర్. వినోద్ నాయక్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర సేవా వాహనాల తనిఖీ

**వేద న్యూస్, హుస్నాబాద్:**

**- సిబ్బందికి అధికారుల సూచనలు**



హుస్నాబాద్ క్లస్టర్ పరిధిలో అందుబాటులో ఉన్న అత్యవసర సేవా వాహనాలపై అధికారులు శనివారం సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సంపత్, సిద్దిపేట జిల్లా ఈఎమ్ హరిరామకృష్ణ పాల్గొన్నారు. తనిఖీలో భాగంగా కోహెడ, హుస్నాబాద్, మద్దూరు ప్రాంతాల్లో సేవలందిస్తున్న 108 అంబులెన్సులతో పాటు హుస్నాబాద్‌లోని 102, 1962 అత్యవసర వాహనాల పనితీరును పరిశీలించారు. వాహనాల సాంకేతిక పరిస్థితి, వైద్య పరికరాల అందుబాటు, అత్యవసర కాల్స్‌కు స్పందించే వేగం వంటి అంశాలను సమీక్షించారు. అదే సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరును పరిశీలించి, ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. అత్యవసర కాల్స్‌కు వెంటనే స్పందించడం, వాహనాల నిర్వహణలో జాగ్రత్తలు పాటించడం, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమేష్, శ్రీనివాస్, రాజిరెడ్డి, జగన్, వీరేశం, వెంకట్, ప్రేమ్ కుమార్, రాజు బి, శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

**- సహకార సంఘం మాజీ చైర్మన్ గడ్డం స్వధర్ రెడ్డి**



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల ప్రజలకు సల్కునూరు సహకార సంఘం మాజీ చైర్మన్ గడ్డం స్వధర్ రెడ్డి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి హిందూ పండుగల్లో అత్యంత పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. మండల ప్రజలంతా భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు, జాగరణ నిర్వహించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. పరమేశ్వరుడి ఆశీస్సులతో మండల ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని కోరుతూ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

# చేతిరాతలో రాష్ట్ర ఉత్తమ పాఠశాలగా 'నవత'

**వేద న్యూస్, చందుర్తి:**



అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లుసిడ్ చేతిరాత పోటీలలో మండల కేంద్రంలోని నవత ఇంగ్లీష్ మీడియం పాఠశాల రాష్ట్ర ఉత్తమ పాఠశాల అవార్డును అందుకుంది. గత ఏడాది కూడా ఇదే అవార్డును పొందిన నవత పాఠశాల, ఈసారి వరుసగా రెండోసారి రాష్ట్ర స్థాయి ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడం విశేషం. గత డిసెంబర్‌లో అక్షర ఫౌండేషన్ అధినేత మీరాజ్ మహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన చేతిరాత పరీక్షలో సుమారు 30 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. నవత పాఠశాల నుంచి 140 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 4 మంది సౌత్ ఇండియా సూపర్ స్టార్ అవార్డు, 19 మంది స్టేట్ అవార్డులు, 46 మంది స్పార్క్ అవార్డులు, 65 మంది సర్టిఫికెట్ అవార్డులు పొందారు. ఈ అవార్డుల ప్రదానోత్సవం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ప్రకాశం హాల్లో నిర్వహించగా, ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు అవార్డు స్వీకరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన నవత పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను ప్రొఫెసర్ కోదండరాం అభినందించారు.

# ఘనంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలోని శివాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా శనివారం అర్చకులు దయానంద్ శర్మ ఆధ్వర్యంలో బలిహరణం, ధ్వజారోహణం, హోమం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, వేములవాడ దత్తత దేవాలయమైన ఈ శివాలయంలో శివపార్వతుల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేతె లక్ష్మారెడ్డి, బొలగం సత్యనారాయణ, ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, నాయకులు నిమ్మ సుధాకర్ రెడ్డి, నల్ల పరశురాములు, మోతే మల్లారెడ్డి, సూర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# అబాకస్ విజేత సాక్షరకు సన్మానం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని వాణి సాహితీ విద్యానికేతన్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని సాక్షర రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రైజింగ్ స్టార్ ప్రశంస పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా రుద్రూర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సాక్షర (ఉప్పు సాయిలు కుమార్తె)ను ఘనంగా సన్మానించారు. విశ్వ ఎడిటిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో సాక్షర గతంలో జోనల్ టాపర్‌గా నిలిచి, ప్రస్తుతం రాష్ట్రస్థాయి రైజింగ్ స్టార్ అవార్డును అందుకోవడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆర్ఏఐడీఎస్ అధ్యక్షుడు కర్రోల కృష్ణ ప్రసాద్, సభ్యులు మోత్కూరి నారాయణ, నూతిపల్లి బాలరాజ్, పాఠశాల ప్రిన్సిపల్ లోగం నాగరాజు, ఉపాధ్యాయులు సమీర్, ఉపాధ్యాయినీలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా..?

**- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్ విమర్శలు**




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జక్కల్ శివారులోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో భోజన సమస్యపై విద్యార్థులు ఆందోళనకు దిగిన ఘటనపై బీఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సమస్యలు పెరిగాయని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడు తున్న పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. విద్యార్థులు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నాయకత్వంలో గురుకులాలను దేశంలోనే ఉత్తమ స్థాయికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులు తరచూ ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటూ, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎక్కడ అన్యాయం జరిగినా బీఆర్ఎస్ పార్టీ, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరపున పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరెల్లి వినయ్ కుమార్, కె. విష్ణు, కె. సిద్ధార్థ, కె. మణి శర్మ, కె. జశ్వంత్, సాయి తేజ, కె. వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- టెన్త్ పరీక్షలపై విద్యార్థులకు సూచన



**వేద న్యూస్, తిమ్మాపూర్:**

ఉన్నత విద్యలో రాణిస్తేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. మిగిలిన సమయాన్ని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుని ఉపాధ్యాయుల సలహాలు తీసుకుంటూ పరీక్షలకు సిద్ధం కావాలని తెలిపారు. గణితంపై భయం విడిచి సాధన చేస్తే మంచి మార్కులు సాధించడం సాధ్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా గణితంలో ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంటుందని, క్రమం తప్పకుండా సాధన చేయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు బట్టలు అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# మహానంద చౌదరి ఔదార్యం స్ఫూర్తిదాయకం

- రంజాన్ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు కిట్ల పంపిణీ

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



మిర్యాలగూడకు చెందిన కృష్ణ సాయి హాస్పిటల్ నిర్వాహకులు డా. మహానంద చౌదరి ఔదార్యం స్ఫూర్తిదాయకమని హ్యూ మన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ పేర్కొన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లను పంపిణీ చేసేందుకు ఆయన ముందుకు రావడం అభినందనీయమన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కిట్ల పంపిణీ కార్యక్రమంలో హమీద్ షేక్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏడాది రంజాన్ మాసంలో అవసరమైన కుటుంబాలకు సహాయం అందిస్తూ డా. మహానంద చౌదరి చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ముస్లిం సోదరసోదరీమణులు రంజాన్ ఉపవాసాలను భక్తిశ్రద్ధలతో ఆచరించాలని, అందరిపై అల్లా కరుణ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, వహీద్, నర్సింహా, జయేష్ తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడి నరసయ్యకు డాక్టరేట్

- గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ అందజేత

**వేద న్యూస్, కారేపల్లి:**



ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, ప్రజా నేత గుమ్మడి నరసయ్యకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన విశేష కృషికి గాను గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్) ప్రకటించింది. ఈ పురస్కార ప్రదానోత్సవం చెన్నైలోని మైలాపూర్ భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించగా, గుమ్మడి నరసయ్య తరపున ఆయన కుమార్తె కుమారి నర్సా ఈ గౌరవాన్ని స్వీకరించారు. యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గౌని నర్సింహ గౌడ్, నామినేషన్ కమిటీ సభ్యులు డాక్టరేట్ పట్టాను అందజేశారు. సింగరేణి మండలంలోని టేకులగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి నరసయ్య ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటికీ, నేటికీ సాధారణ జీవనశైలిని కొనసాగిస్తూ ప్రజల మధ్యే ఉంటున్నారు. సైకిల్ లేదా బస్సులో ప్రయాణిస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఆయన ప్రత్యేకత. గుమ్మడి నరసయ్యకు గౌరవ డాక్టరేట్ లభించడంపై ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాసేవకు అంకితమైన నాయకుడికి దక్కిన ఈ గౌరవం తెలంగాణకు గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్‌పై కేసు నమోదు

- బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

వెంకటాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడిపై దాడి జరిగిన ఘటనపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించింది. సమాచారం అందుకున్న జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం సంఘటన స్థలానికి చేరుకుని బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పోలీసుల సూచన మేరకు బాలుడికి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మెడికో-లీగల్ కేసు కింద వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎల్వీ ప్రసాద్ ప్రాంతీయ ఆసుపత్రి, సిరిసిల్లకు తరలించి, పిల్లల వైద్యుడు, ఈఎన్‌టీ, ఈఎన్ఎస్ నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు బాలుడిని హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితురాలిగా వెంకటాపూర్ రెండవ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ జాజాల రాణి పేరును చేర్చారు. ఘటనపై సమాచారం ఇవ్వకపోవడంపై అంగన్‌వాడీ టీచర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయగా, ఆమె ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి విచారణ నిర్వహించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించినట్లు వెల్లడించారు. ఆమెపై




శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు చర్యలు ప్రారంభించారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు సురక్షితంగా ఉన్నాయని, బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. బాలల హక్కులను ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి, అవసరమైతే ఉద్యోగం నుంచి తొలగింపు వంటి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హెచ్చరించారు.

# పెట్టుబడి సాయం విడుదల చేయాలి



- బీజేపీ నేత భూమల్ల అనిల్ కుమార్

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

యాసంగి పంటకు సంబంధించిన పెట్టుబడి సహాయాన్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు రైతు భరోసా పేరుతో ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. కౌలు రైతులకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున ఇస్తామని ప్రకటించినప్పటికీ అందజేయలేదని, వడ్లకు రూ.500 బోనస్ కూడా ఇవ్వలేదన్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం ఇంకా బకాయిగా ఉందని, డిసెంబర్-జనవరి నెలల్లో ఇవ్వాల్సిన యాసంగి పెట్టుబడి సాయం కూడా రైతుల ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రైతు భరోసా అంశాన్ని ప్రస్తావించడం సరైంది కాదన్నారు. రైతులు ప్రభుత్వ హామీలను గమనిస్తున్నారని, వెంటనే పెట్టుబడి సాయం విడుదల చేయాలని, లేకపోతే బీజేపీ పార్టీ తరపున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు మేకల మల్లేశం, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బత్తిని సాయగౌడ్, జిల్లా నాయకులు కొలనూరు ముత్తవ్వ, పినికాసి అనిల్, భూత్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి కమలాకర్ రావు, పిల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగలు సంఘటితం కావాలి

- మోత్కుపల్లి నర్సింహులు
- కరీంనగర్లో మాదిగ మహాశక్తి ఆత్మీయ సదస్సు

**వేద న్యూస్, కరీంనగర్:**

రాజ్యాధికారాన్ని సాధించాలంటే మాదిగలు చైతన్యవంతులై సంఘటిత శక్తిగా ఎదగాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని ప్రతిమ హోటల్‌లో మాదిగ మేథావుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన మాదిగ మహాశక్తి ఆత్మీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో గణనీయమైన జనాభా ఉన్న మాదిగలు ఐక్యంగా ఉంటే రాజకీయంగా ప్రభావం చూపగలరని అన్నారు. మాదిగల ఐక్యత కోసం మహాశక్తి ఆత్మీయ సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. మాదిగ దండోరా ఉద్యమంలో అమరులైన వారిని స్మరించుకుంటూ, ఎస్సీ వర్గీకరణ సాధనలో వారి పాత్ర విశేషమని కొనియాడారు. టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు



కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే లెదర్ పార్కులను పునరుద్ధరించి, కొత్త పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వరంగల్ మాజీ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ మాదిగలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రాజకీయంగా బలోపేతం చేయడం ఈ సదస్సుల లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కనుకయ్య, విజయ్ కుమార్, గజ్జెల స్వామి, పల్లెల వీరస్వామి, డాక్టర్ శ్రీనివాస్, బొంకూరు శంకర్, దేవేందర్, బండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దాలి



- కౌన్సిలర్లు బాధ్యతాయుతంగా పని చేయాలి
- పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి:**

సూర్యాపేట పురపాలక సంఘాన్ని అవినీతి రహితంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. గతంలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలు పునరావృతం కాకుండా నూతన పాలక మండలి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. నూతనంగా ఎన్నికైన సూర్యాపేట పురపాలక సంఘం కౌన్సిలర్లు శనివారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. 48 వార్డుల్లో 31 స్థానాల్లో విజయం సాధించిన కౌన్సిలర్లను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై ఉన్న సూర్యాపేట పట్టణం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టేందుకు కౌన్సిలర్లు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా సూర్యాపేట అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అవసరమైన నిధులు సమకూర్చి అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పీసీసీ కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులను ఆకర్షిస్తున్న వర్షకొండ శివాలయం

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామ శివారులోని అతి పురాతన శివాలయం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. రాతి పలకలను ఒక దానిపై ఒకటి శిఖరాకారంలో నిర్మించిన ఈ జంగమయ్య గుట్ట శివాలయం ప్రత్యేకతతో ప్రసిద్ధి చెందింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి శివభక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. నిత్యపూజలతో విరాజిల్లుతున్న ఈ ఆలయం భక్తుల కోరికలు తీర్చే పుణ్యక్షేత్రంగా పేరుగాంచిందని గ్రామస్థులు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయ కమిటీ, స్థానిక యువకులు, దాతల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తుమ్మల జయ, ఆలయ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



వేద న్యూస్
ఆదివారం ఫిబ్రవరి 15, 2026

# ఏడుపాయల జాతరకు భారీ బందోబస్తు

- సీసీటీవీ నిఘా, కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- భక్తులు పోలీసుల సూచనలు పాటించాలి
- జిల్లా ఎస్పీ డీవఅ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్:**

మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న ఏడుపాయల వనదుర్గ మాత జాతరకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. లక్షలాది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జాతర ప్రాంగణం మొత్తం సీసీటీవీ కెమెరాల నిఘాలో ఉంచడంతో పాటు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా క్యూలైన్లు, పార్కింగ్ ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. అనుమానాస్పద వస్తువులను తాకవద్దని, వాహనాలను సూచించిన ప్రదేశాల్లోనే పార్క్ చేయాలని ఎస్పీ సూచించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్, మహిళా పోలీసులు, మఫ్టీ సిబ్బందిని మోహరించారు. రాత్రి వేళల్లో ఫుట్ పెట్రోలింగ్, క్యూఆర్‌టీ బృందాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోంది. ఈ బందోబస్తులో ఒక అదనపు ఎస్పీ, 4 డీఎస్పీలు, 19 సీఐలు, 66 ఎస్‌ఐలు, 150 ఏఎస్‌ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 220 కానిస్టేబుళ్లు, 120 మహిళా పోలీసులు, 266 హోంగార్డులు సహా సుమారు 900 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించి జాతరను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు.

# మహా శివరాత్రికి వేములవాడ సిద్ధం

- భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడకు వచ్చే భక్తుల కోసం జిల్లా యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేసింది. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక ప్రణాళిక ప్రకారం అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు అవసరమైన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇప్పటికే అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారులను నియమించారు. జాతర పరిసరాల్లో 10 హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి దర్శనం, భద్రత, పారిశుధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిన్నారులతో వచ్చే తల్లుల కోసం ప్రత్యేక బేబీ ఫీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. పరిశుభ్రమైన వాతావరణం, గోప్యత, కూర్చునే సౌకర్యాలతో ఈ గదులు తల్లులకు ఉపయోగకరంగా ఉంటాయి. దివ్యాంగులు, వృద్ధులు సులభంగా దర్శనం చేసుకునేందుకు ప్రధాన ప్రవేశ ద్వారాలు, హెల్ప్ డెస్క్‌ల వద్ద సుమారు 100 వీల్ చైర్లు అందుబాటులో ఉంచి సిబ్బందిని నియమించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు క్యూ లైన్లు, త్రాగునీటి కేంద్రాల్లో స్టీల్ గ్లాసులతో స్వచ్ఛమైన నీరు అందిస్తున్నారు. గ్లాసుల శుభ్రతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది. భక్తులు దారి తప్పకుండా దర్శన మార్గాలు, మరుగుదొడ్లు, త్రాగునీటి కేంద్రాలు, హెల్ప్ డెస్క్‌ల వద్ద తెలుగులో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్‌ల ద్వారా దర్శనం, వసతి, వైద్య సేవలపై సమాచారం అందిస్తున్నారు.



**పారిశుధ్యం, వైద్య సేవలు**

మున్సిపల్, పంచాయితీ శాఖల ఆధ్వర్యంలో దేవస్థానం పరిసరాల్లో నిరంతర పారిశుధ్య పనులు చేపట్టారు. అలాగే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర చికిత్స కోసం వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. జాతర ఏర్పాట్లను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాల సహాయంతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జాతరకు వచ్చే భక్తులు ఈ సౌకర్యాలను వినియోగించుకుని స్వామివారి దర్శనం ప్రశాంతంగా చేసుకోవాలని అధికారులు కోరారు.

# సత్యంకోసం కలం.. సమాజంకోసం ప్రెస్ క్లబ్

- భక్త రామదాసు ప్రెస్ క్లబ్ ఘన ఆవిర్భావం



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

నేలకొండపల్లి పట్టణంలో భక్త రామదాసు ప్రెస్ క్లబ్‌ను శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమైన మీడియా రంగానికి ఈ ప్రెస్ క్లబ్ నూతన వేదికగా నిలుస్తుందని ప్రముఖులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తరఫున క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ బీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రెస్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రెస్ క్లబ్ కేవలం భవనం కాదని, ప్రజా సమస్యలకు ప్రతిధ్వని అయ్యే వేదికగా నిలవాలని సూచించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పాత్రికేయులు సత్యం, నైతిక విలువలను కాపాడుతూ సమాజ అభ్యున్నతికి కలం ద్వారా సేవ చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఐక్యతకు ప్రెస్ క్లబ్ వేదికగా నిలిచి ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ మద్దినేని మహేష్, కొత్త కొత్తూరు ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, బిజెపి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ మధు, ఫారెస్ట్ ఆఫీసర్ డానియేలు, అపర మేధావి గుగ్గిళ్ల దివ్యమూర్తి, కాంగ్రెస్ యువజన నాయకులు కొమ్మూరి నరేష్, దోసపాటి రామదాసు, పసుపులేటి ఉపేందర్, మాల మహానాడు నాయకులు బట్టపోతుల ప్రకాశం, ఉత్తమ సామాజిక అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు, రాజకీయ పుర ప్రముఖులు, కుల సంఘనాయకులు, తదితరులు,పాల్గొన్నారు.

# పుల్వామా అమరవీరులకు నివాళులు



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

పుల్వామా దాడిలో అమరులైన వీర సైనికులకు వేములవాడలో హరిహర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘన నివాళుల అర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు అమర జవాన్ల చిత్రపటాలకు నివాళులర్పించి, వారి త్యాగాన్ని స్మరించుకున్నారు. అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి, కొవ్వొత్తులు వెలిగించారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల సేవలు చిరస్మరణీయమని ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. ఫిబ్రవరి 14ను బ్లాక్ డేగా పాటిస్తూ అమరవీరులను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బండ వేణు, వైస్ చైర్మన్ చేకూర్తి నవీన్, ప్రధాన కార్యదర్శి సింహాచలం హరీష్, కోశాధికారి రమేష్, సలహాదారుడు ఓదెల నరేష్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినం

- చిన్నారి ప్రాణం సమాజానికి అమూల్యమైన బాధ్యత
- ముందస్తు గుర్తింపు, సమయానుకూల చికిత్స ఆశకు మార్గం
- ఆర్థిక భారం, మానసిక వేదన కుటుంబాల పోరాటం
- అవగాహన, పరిశోధన, సమగ్ర మద్దతు సమిష్టి కర్తవ్యం

**వేద న్యూస్ డెస్క్:**

పిల్లల నవ్వు ప్రతి ఇంటి ఆనందానికి ప్రతీక. ఆ నవ్వు క్రమంగా మసకబారడం ఒక కుటుంబానికి మాత్రమే కాదు, సమాజానికి చెందిన బాధ. బాల్య క్యాన్సర్ అనే పదం వినగానే భయం కలుగుతుంది. కానీ భయంతో కాదు, అవగాహనతో ఈ వ్యాధిని ఎదుర్కోవాలి. పిల్లల్లో కనిపించే క్యాన్సర్ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం కల్పించడం, ముందస్తు గుర్తింపు ప్రాధాన్యాన్ని తెలియజేయడం, సరైన చికిత్స అందుబాటులో ఉండేలా చూడడం, బాధిత కుటుంబాలకు మానసికఆర్థిక మద్దతు కల్పించడం ఇవే అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినం ఉద్దేశాలు. బాల్య క్యాన్సర్‌ను చాలా మంది అరుదైన వ్యాధిగా భావిస్తారు. కానీ వాస్తవం అంత సులభం కాదు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది పిల్లలు వివిధ రకాల క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. రక్త క్యాన్సర్, మెదడు గడ్డలు, లింఫోమా వంటి రకాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. లక్షణాలు ప్రారంభ దశలో స్పష్టంగా కనిపించకపోవడం వల్ల తల్లిదండ్రులు ఆలస్యంగా గుర్తించే ప్రమాదం ఉంది. తరచూ జ్వరం రావడం, అసాధారణ వాపులు, బలహీనత, రక్తహీనత, ఆకలి తగ్గడం వంటి సూచనలను నిర్లక్ష్యం చేయకూడదు. ముందస్తు పరీక్షలు, వైద్యుల సలహా ప్రాణాలను కాపాడగలవు.

చికిత్స ఖరీదైనది, దీర్ఘకాలికం. నెలలు, కొన్ని సందర్భాల్లో సంవత్సరాలపాటు చికిత్స కొనసాగాల్సి ఉంటుంది. ఇది కుటుంబాలకు ఆర్థికంగా పెద్ద భారం. మధ్యతరగతి, పేద కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. చికిత్స ఖర్చులు, ఆసుపత్రి వసతి, ఔషధాలు, ప్రయాణ ఖర్చులు కలిపి కుటుంబాన్ని తీవ్ర ఒత్తిడిలోకి నెడుతున్నాయి. అందుకే ప్రభుత్వ ఆరోగ్య పథకాలు బలోపేతం కావాలి. ప్రతి పిల్లవాడికి సమాన చికిత్స అందేలా వైద్య సదుపాయాలు గ్రామీణ ప్రాంతాల వరకూ విస్తరించాలి.

బాల్య క్యాన్సర్ కేవలం శారీరక వ్యాధి కాదు. అది మానసిక పరీక్ష కూడా. చిన్న వయసులోనే పిల్లలు ఆసుపత్రి గదుల్లో రోజులు గడపాల్సి వస్తోంది. పాఠశాల, స్నేహితులు, ఆటల దూరమవుతున్నాయి. ఇది వారి భావోద్వేగ స్థితిపై ప్రభావం చూపుతుంది. కాబట్టి కౌన్సిలింగ్, మానసిక మద్దతు, విద్యా సౌకర్యాలు అవసరం. ఆసుపత్రుల్లో పిల్లలకు సానుకూల వాతావరణం కల్పించాలి. కుటుంబ సభ్యులకు కూడా ధైర్యం ఇవ్వాలి.

అవగాహన కార్యక్రమాలు మరింత విస్తరించాలి. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, గ్రామ సభలు వేదికలుగా ఉపయోగించాలి. అపోహలను తొలగించాలి. క్యాన్సర్ అంటే అంతమని భావించే దృక్పథం మారాలి. సమయానికి గుర్తిస్తే చికిత్సతో నయం కావచ్చని ప్రజల్లో నమ్మకం పెంచాలి. పరిశోధనలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. తక్కువ ఖర్చుతో చికిత్స అందించే విధానాలను అభివృద్ధి చేయాలి. సమాజం కూడా బాధ్యత వహించాలి. బాధిత కుటుంబాలను ఒంటరిగా వదిలేయకుండా సహాయం చేయాలి. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలి. రక్తదానం, అవయవ దానం, ఆర్థిక సహాయం వంటి మార్గాల ద్వారా సహకారం అందించాలి. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా జీవించాలి అన్న సంకల్పం సమాజంలో బలపడాలి.అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినం మనకు ఒక గాఢమైన సందేశాన్ని ఇస్తుంది. చిన్నారి ప్రాణం అమూల్యం. ఆ ప్రాణాన్ని కాపాడడం మన సమిష్టి బాధ్యత. అవగాహనతో, సమగ్ర వైద్య సేవలతో, మానసిక మద్దతుతో ఈ వ్యాధిని ఎదుర్కోవచ్చు. ఆశను నింపే చర్యలు తీసుకుంటే చిన్నారి నవ్వు మళ్లీ వెలిగుతుంది.

మొత్తంగా బాల్య క్యాన్సర్‌పై పోరాటం వైద్య రంగానికే పరిమితం కాదు. అది సమాజం మొత్తం కలిసి చేయాల్సిన యుద్ధం. ప్రతి పిల్లవాడికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు హక్కు. ఆ హక్కును కాపాడడం మనందరి కర్తవ్యం. అదే ఈ దినం మనకు గుర్తు చేసే అసలు సత్యం. కుటుంబ మద్దతు, పాఠశాలల సహకారం అవసరం. చికిత్సతో పాటు ఆశ, ధైర్యం కూడా సమానంగా అవసరం.

# శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన కోటిలింగాల




**వేద న్యూస్, కారేపల్లి:**

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పొలంపల్లి కోటిలింగాల దేవాలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కాకతీయుల కళాక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన కోటిలింగాల రామాలయంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం శివరాత్రి మహోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆదివారం నుంచి మంగళవారం వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమై, అనంతరం రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణలు, రాత్రి 8 గంటలకు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. గురువారం మహా అన్నపూజ, శుక్రవారం స్వామివారి ఊరేగింపు, జాగరణ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఓ. మల్లెల రవీంద్ర ప్రసాద్ ఆలయాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు తాగునీరు, క్యూలైన్లు, పారిశుధ్యం వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సూచించారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ ఆలయాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ప్రాంతానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

# సేవాలాల్ మహారాజ్ జయంతి ఘన నిర్వహణ

- కేసీఆర్ పాలనలో అధికారిక గుర్తింపు
- గిరిజన సంక్షేమానికి తీసుకున్న కీలక నిర్ణయాలు
- భోగ్ బండార్‌కు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపు
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**వేద న్యూస్ హైదరాబాద్ :**

తెలంగాణ భవన్‌లో బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా ఘనంగా నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే సేవాలాల్ మహారాజ్ జయంతికి అధికారిక గుర్తింపు లభించిందని ఆమె గుర్తుచేశారు. ప్రతి సంవత్సరం జయంతి నిర్వహణకు రెండు కోట్ల రూపాయలను కేటాయించడం ద్వారా గిరిజనుల పట్ల కేసీఆర్ చూపిన ఆత్మీయత స్పష్టమైందన్నారు. కేసీఆర్ పాలన గిరిజన, ఆదివాసీ బిడ్డలకు స్వర్ణయుగంగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో నాలుగు శాతంగా ఉన్న గిరిజన రిజర్వేషన్లను కేసీఆర్ పదశాతానికి పెంచినట్లు వివరించారు. 2700కు పైగా గిరిజన, ఆదివాసీ, చెంచు గూడేలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి స్థానిక స్వయం పాలనకు బలాన్నిచ్చారని తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో 25 కోట్ల వ్యయంతో సేవాలాల్ మహారాజ్ భవనాన్ని నిర్మించడంతో పాటు ఆదివాసీల కోసం కొమురం భీం భవనాన్ని కూడా నిర్మించారని పేర్కొన్నారు. ఒకే రోజు నాలుగు లక్షల తొమ్మిది వేల



ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఆమె స్పష్టం చేశారు. సేవాలాల్ మహారాజ్ జయంతికి అధికారిక గుర్తింపు తెలంగాణలో ఇచ్చిన తరువాతే ఇతర రాష్ట్రాలు కూడా గుర్తింపు ఇచ్చాయని తెలిపారు. ఎస్టీలకు గురుకులాలను స్థాపించడం ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలను సాధించే అవకాశాలు పొందారని పేర్కొన్నారు. కేసీఆర్ గిరిజనుల కోసం చేసిన సేవలకు వారు ఎప్పటికీ రుణపడి ఉంటారని సత్యవతి రాథోడ్ అన్నారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు గిరిజన, ఆదివాసీ సమాజం పట్టుదలతో పని చేస్తుందని తెలిపారు. రేపు ఉదయం పది గంటలకు తెలంగాణ భవన్‌లో భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించనున్నామని, గిరిజన సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వేద న్యూస్

ఆదివారం ఫిబ్రవరి 15, 2026

# ఎంజీఎన్ఆర్ఈజీఏ పరిరక్షణ యాత్రలో వైఎస్ షర్మిల

- కడప యానాది కాలనీలో రచ్చబండ కార్యక్రమం
- ఉపాధి హామీ పథకం బలోపేతంపై డిమాండ్
- కాంగ్రెస్ అమలు చేసిన చట్టం పునరుద్ధరణ కోరింపు



**వేద న్యూస్ అమరావతి:**

ఎంజీఎన్ఆర్ఈజీఏ పరిరక్షణ యాత్ర నేడు వైఎస్ఆర్ కడప జిల్లాలో కొనసాగింది. కడప టౌన్ యానాది కాలనీలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధిపొందిన శ్రామికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిల మాట్లాడుతూ పథకం అమలులో వస్తున్న మార్పులపై ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పనులను సమర్థంగా అమలు చేసిందని, కరువు పనులు విస్తృతంగా సాగాయని, వేతనాలు సమయానికి అందేవని శ్రామికులు గుర్తుచేసుకున్నారని తెలిపారు. 100 రోజుల పని హక్కుగా మారిందని, గ్రామీణ కుటుంబాలకు ఇది ఆర్థిక భరోసా కల్పించిందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పథకం నీరుగార్చబడుతోందని, జాబ్ కార్డుల తొలగింపు, వేతనాల ఆలస్యం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని రచ్చబండ వేదికగా కార్మికులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ డబ్బులు ఎప్పుడు ఖాతాల్లో జమ అవుతాయో స్పష్టత లేదని వారు పేర్కొన్నారని వివరించారు. మహాత్మా గాంధీ పేరుతోనే పథకం కొనసాగాలని, కాంగ్రెస్ అమలు చేసిన ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. గ్రామీణ శ్రామికులకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని, పథకాన్ని బలోపేతం చేయాలని ఆమె కోరారు.

# అంబటి రాంబాబుపై బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వ్యాఖ్యలు

**వేద న్యూస్ అమరావతి:**



వెంకటేశ్వర స్వామితో పెటుట్టుకున్న వారు నామరూపాలు లేకుండా పోతారని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం మాజీ మంత్రి అంబటి రాంబాబును ఇబ్బంది పెడుతోందని అనుకుంటోందని, అయితే అంబటి మాత్రం పార్టీ కోసం పోరాడు తున్నాననే భావనతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా జరుగుతున్న పరిణామాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. అంబటి రాంబాబు తన రాజకీయ జీవితాన్ని పార్టీ కోసం అంకితం చేశారని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఒత్తిళ్లు తీసుకువస్తోందని భావిస్తున్నప్పటికీ, ఆయన వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అన్నారు. పార్టీ సిద్ధాంతాల కోసం నిలబడటం తప్పు కాదని స్పష్టం చేశారు. ఈ పోరాటం వ్యక్తిగతం కాదని, రాజకీయ పరమైనదని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. అంబటి రాంబాబు అలా అనుకుంటున్నంత కాలం ప్రభుత్వం ఆయనపై చర్యలు తీసుకునే అవకాశం లేదని వ్యాఖ్యానించారు. రాజకీయ ఒత్తిళ్లు ఎంత వచ్చినా పార్టీ కార్యకర్తలు ధైర్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.

# రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ

**వేద న్యూస్ అమరావతి:**



విశాఖలోని కొమ్మది ప్రాంతం వివేకానంద కాలనీలో రిటైర్డ్ విద్యుత్ శాఖ ఉద్యోగి అప్పలరాజు (62) నివాసంలో చోరీ జరిగింది. ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లిన ఆయన ఇంటికి తాళం వేసి వెళ్లారు. యాత్ర ముగించుకొని తిరిగి వచ్చినప్పుడు ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం కలిగింది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలు ఖాళీగా కనిపించాయి. 21 తులాల బంగారు ఆభరణాలు, రూ.6 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఇంటిని లక్ష్యంగా చేసుకుని పథకం ప్రకారం దొంగలు చోరీ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై సమాచారం సేకరిస్తున్నారు. చోరీ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగలను త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. గృహాలు ఖాళీగా ఉంచే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

# తిరుపతి లడ్డూ అంశంపై నెల్లూరులో పొర్లుడు దండాల కార్యక్రమం



**వేద న్యూస్ అమరావతి:**

తిరుపతి లడ్డూలో జరిగిన కల్తీ ఘటన కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని పేర్కొంటూ, దీనిపై ప్రతి హిందువు స్పందించాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు నెల్లూరులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జనసేన జిల్లా సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో పొర్లుడు దండాల కార్యక్రమం చేపట్టారు.

- అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపుతో ప్రత్యేక దీక్ష
- 4.5 కిలోమీటర్ల దూరం గోవింద నామస్మరణ
- వందలాది భక్తులు, జనసైనికుల భాగస్వామ్య

శనివారం ఉదయం 8 గంటలకు శ్రీ రాజరాజేశ్వరీ దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం మాగుంట లేయవుట్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వరకు సుమారు 4.5 కిలోమీటర్ల దూరం సాగింది. గోవింద నామస్మరణల మధ్య నూనె మల్లికార్జున యాదవ్ పొర్లుడు దండాలు పెట్టారు. వందలాది భక్తులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొని కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ సనాతన ధర్మ రక్షణలో జనసేన నాయకులు ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. తిరుపతి లడ్డూ అంశంపై నిజానిజాలు వెలికితీయాలని, భక్తుల విశ్వాసాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం నెల్లూరులో చర్చనీయాంశమైంది. కార్యక్రమం శాంతియుతంగా ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల విశ్వాసాలకు భంగం కలిగించే ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పాల్గొన్నవారు కోరారు.

# టాటా ఏఐఏ నుంచి రెండు కొత్త పథకాలు..

- ఫిబ్రవరి 16 వరకు అవకాశం.. బీమా రక్షణతో పాటు పెట్టుబడిదారులకు లాభాలు




**వేద న్యూస్ డెస్క్:**

ప్రముఖ బీమా సంస్థ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ పెట్టుబడిదారులను దృష్టిలో ఉంచుకుని రెండు కొత్త పథకాలను ప్రారంభించింది. దీర్ఘకాలిక సంపద సృష్టితో పాటు కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే విధంగా రూపొందించిన ఈ పథకాలలో పెట్టుబడి పెట్టేందుకు ఫిబ్రవరి 16ను చివరి తేదీగా సంస్థ ప్రకటించింది. పెట్టుబడితో పాటు బీమా రక్షణ కూడా అందించడం ఈ పథకాల ప్రత్యేకతగా నిలుస్తోంది.

సంపద పెంపు లక్ష్యంగా విలువ ఆధారిత ఈక్విటీ పెట్టుబడి విధానంతో ఈ రెండు పథకాలు రూపొందించబడ్డాయి. ఒకటి విలువ సూచీ ఆధారిత వృద్ధి పథకం కాగా, మరొకటి విరమణ అనంతర అవసరాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పెన్షన్ పథకం. మార్కెట్‌లోని వివిధ రంగాలకు చెందిన పెద్ద, మధ్యతరహా, చిన్న సంస్థల వాటాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన లాభాలను అందించడమే లక్ష్యంగా సంస్థ తెలిపింది.

ఈ పథకాలలో కనీసంగా నెలకు రెండు వేల నుంచి మూడు వేల రూపాయల వరకు పెట్టుబడితో ప్రారంభించవచ్చు. ఒకేసారి పెట్టుబడి పెట్టే వారికి సంవత్సరానికి కనీసం ఇరవై నాలుగు వేల నుంచి ముప్పై వేల రూపాయల వరకు పెట్టుబడి అవసరం ఉంటుంది. ప్రారంభ దశలో యూనిట్ ధర పది రూపాయలుగా నిర్ణయించారు.

విలువ సూచీ పథకం ముఖ్యంగా పిల్లల విద్య, భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలు వంటి దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడింది. మరోవైపు పెన్షన్ పథకం విరమణ అనంతరం స్థిరమైన ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ఉంది. ఈ రెండు పథకాలలో పెట్టుబడి చేసిన మొత్తంపై లాభాలతో పాటు బీమా రక్షణ కూడా వర్తిస్తుంది.

పన్ను చట్టాల ప్రకారం నిర్దిష్ట నిబంధనల కింద పన్ను మినహాయింపు ప్రయోజనాలు కూడా పొందవచ్చని సంస్థ తెలిపింది. మార్కెట్ ఆధారిత లాభాలను ఆశిస్తూ, అదే సమయంలో కుటుంబ భద్రతను కూడా కోరుకునే పెట్టుబడిదారులకు ఈ పథకాలు అనుకూలంగా ఉంటాయని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# 'ప్యూర్ ఈవీ' హై-టెక్ షోరూమ్ ప్రారంభం

**వేద న్యూస్ డెస్క్:**




హైదరాబాద్‌లోని సాగర్ క్రాస్ రోడ్డు వద్ద ప్యూర్ ఈవీ సంస్థ తన ఆధునిక సౌకర్యాలతో కూడిన కొత్త ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభించింది. విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం, కాలుష్యాన్ని తగ్గించడం, సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే పర్యావరణహిత రవాణా పరిష్కారాలను అందించడం లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పెట్రోలు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వాహనాలపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందని, ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనాల విక్రయంతో పాటు సాంకేతిక అవగాహన కల్పించే కేంద్రంగా ఇది పనిచేస్తుందని వెల్లడించారు. ఇక్కడ ప్రదర్శనకు ఉంచిన విద్యుత్ స్కూటర్లు, మోటార్ సైకిళ్లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా అధిక ప్రయాణదూరం అందించే మోడళ్లు, యువతను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన వాహనాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇవే కాకుండా గృహ మరియు వాణిజ్య అవసరాల కోసం రూపొందించిన అధిక సామర్థ్యంతో కూడిన లిథియం అయాన్ విద్యుత్ నిల్వ పరికరాలను కూడా సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. స్వదేశీ పరిశోధన ఆధారంగా తయారైన ఈ బ్యాటరీలు భద్రత, దీర్ఘకాల వినియోగం, విద్యుత్ ఆదా వంటి ప్రయోజనాలను అందిస్తాయని సంస్థ పేర్కొంది

# గోల్డ్ లోన్‌పై ఆర్‌బీఐ కీలక మార్పులు

**వేద న్యూస్ డెస్క్:**



అత్యవసర పరిస్థితుల్లో తక్షణంగా నగదు అవసరమైనప్పుడు చాలా మంది బంగారం మీద రుణాన్ని ఎంచుకుంటారు. ఈ నేపథ్యంలో బంగారం రుణాలు తీసుకునే వారికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ కీలక మార్పులు ప్రకటించింది. తాజా నిబంధనలు రుణగ్రహీతలకు మరింత ఆర్థిక సౌలభ్యం, భద్రత కల్పించేలా రూపొందించబడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా లోన్ టు వ్యాల్యూ నిష్పత్తిలో మార్పులు చేసి, బంగారం విలువపై మరింత రుణం పొందే అవకాశాన్ని కల్పించారు. ఇప్పటి వరకు బంగారం విలువలో 75 శాతం వరకు మాత్రమే రుణం లభించగా, కొత్త నిబంధనల ప్రకారం కొన్ని పరిమితులలో ఇది 85 శాతం వరకు పెరిగింది. రూ.2.5 లక్షల వరకు రుణం తీసుకుంటే 85 శాతం, రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు 80 శాతం, రూ.5 లక్షలకంటే ఎక్కువ రుణాలకు 75 శాతం నిష్పత్తి వర్తిస్తుంది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఎక్కువ మొత్తాన్ని పొందే అవకాశం రుణగ్రహీతలకు లభించనుంది. అలాగే ఇప్పటికే తీసుకున్న బంగారం రుణంపై అదనపు రుణం పొందే అవకాశం కూడా కల్పించారు. టాప్-అప్ రుణం ద్వారా అదే బంగారాన్ని తాకట్టు ఉంచి మరింత నిధులు పొందవచ్చు. అయితే ఈ సౌకర్యం పొందేందుకు రుణగ్రహీత చెల్లింపుల చరిత్ర సక్రమంగా ఉండాలి.

# కేంద్రం సంచలన నిర్ణయం..

## కోట్ల ఐఆర్‌సిటిసి ఐడీల బ్లాక్..




**వేద న్యూస్ డెస్క్:**

రైల్వే టిక్కెట్ బుకింగ్ వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల పేరుతో నకిలీగా సృష్టించిన అనుమానాస్పద ఖాతాలపై భారీ స్థాయిలో చర్యలు చేపట్టిన రైల్వే శాఖ, సుమారు మూడు కోట్లకు పైగా ఐఆర్‌సీటీసీ ఖాతాలను నిలిపివేసినట్లు వెల్లడించింది. ఈ నిర్ణయం వల్ల నిజమైన ప్రయాణికులకు టిక్కెట్లు సులభంగా అందే పరిస్థితులు ఏర్పడతాయని అధికారులు తెలిపారు.

రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. టిక్కెట్ బుకింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ పెద్ద మొత్తంలో టిక్కెట్లు బుక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న ముఠాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సాంకేతిక పర్యవేక్షణను పెంచి, అనుమానాస్పద కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఖాతాలను దశలవారీగా నిలిపివేసినట్లు చెప్పారు.

గత కొంతకాలంగా తత్కాల్ టిక్కెట్ల బుకింగ్ సమయంలో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్రానికి అనేక ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు. కొందరు మోసగాళ్లు ఆటోమేటిక్ విధానాలను ఉపయోగించి క్షణాల్లోనే భారీ సంఖ్యలో టిక్కెట్లు బుక్ చేస్తున్నారని, దీంతో నిజమైన ప్రయాణికులకు అవకాశాలు తగ్గుతున్నాయని అధికారులు గుర్తించారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని బుకింగ్ విధానంలో పలు మార్పులు చేపట్టినట్లు తెలిపారు.

తత్కాల్ బుకింగ్‌లో పారదర్శకత పెంచేందుకు ఆధార్ ఆధారిత ఒకసారి ఉపయోగించే సంకేత సంఖ్య ధృవీకరణ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం ద్వారా టిక్కెట్ బుక్ చేసే వ్యక్తి వివరాలు వెంటనే నిర్ధారించుకోవచ్చని, నకిలీ ఖాతాల వినియోగం గణనీయంగా తగ్గుతుందని రైల్వే శాఖ భావిస్తోంది. అదేవిధంగా బహుళ స్థాయి భద్రతా చర్యలు, ఆధునిక గుర్తింపు వ్యవస్థలు, కాప్చా నియంత్రణలను మరింత కఠినతరం చేశారు.

వెబ్‌సైట్‌పై అధిక ఒత్తిడి తగ్గించేందుకు సాంకేతిక మౌలిక వసతులను బలోపేతం చేసినట్లు అధికారులు తెలిపారు. అనుమానాస్పదంగా వరుసగా టిక్కెట్లు బుక్ చేసే ఖాతాలను వెంటనే గుర్తించే ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను కూడా అమల్లోకి తెచ్చినట్లు చెప్పారు.

వేద న్యూస్
ఆదివారం ఫిబ్రవరి 15, 2026

# కుర్రాళ్లను కవ్విస్తున్న అనన్య నాగళ్ల..



**వేద న్యూస్ డెస్క్:**

తెలుగు అమ్మాయిలకు ప్రస్తుతం చిత్రసీమలో మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ఆ జాబితాలో ప్రత్యేకంగా నిలిచిన కథానాయికల్లో అనన్య నాగళ్ల ఒకరు. 'మల్లేశం' చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన అనన్య తొలి సినిమాతోనే తన నటనతో మెప్పించింది. సహజమైన అభినయం, భావ వ్యక్తీకరణతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. తెలంగాణలోని సత్తుపల్లికి చెందిన అనన్య హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసింది. అనంతరం ప్రముఖ సంస్థలో ఉద్యోగం కూడా చేపట్టింది. అయితే నటనపై ఆసక్తితో ఉద్యోగంతో పాటు చిన్న చిత్రాల్లో నటిస్తూ తన ప్రతిభను ప్రదర్శించింది. 'షాదీ' అనే చిన్న చిత్రంలో నటనకు ఉత్తమ నటి పురస్కారం అందుకోవడం ఆమెకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. తరువాత నటుడు ప్రియదర్శితో కలిసి 'మల్లేశం' చిత్రంలో నటించి సినీరంగంలో అడుగుపెట్టింది. ఆపై పవన్ కల్యాణ్ నటించిన 'వకీల్ సాబ్' చిత్రంతో విస్తృతమైన గుర్తింపు దక్కించుకుంది. తరువాత 'మ్యాస్ట్రో', 'ఊర్వశివో రాక్షసివో', 'శాకుంతలం', 'మళ్లీ పెళ్లి', 'పొట్టేల్', 'తంత్ర' వంటి చిత్రాల్లో నటిస్తూ వరుస అవకాశాలు అందుకుంది. అయితే సినిమాలు వరుసగా చేస్తున్నప్పటికీ పెద్ద విజయాలు మాత్రం అందకపోవడం గమనార్హం. ఇప్పటివరకు పన్నెండు చిత్రాల్లో నటించిన ఆమెకు పరిమిత విజయాలే దక్కాయి. అయినప్పటికీ తన ప్రయత్నాన్ని ఆపకుండా కొత్త కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఇక సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ అనన్య చురుకుగా ఉంటుంది. తరచూ కొత్త ఫోటోలు పంచుకుంటూ అభిమానులతో అనుసంధానంగా ఉంటోంది. తాజాగా ఆమె పంచుకున్న చిత్రాలు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. సొగసైన వేషధారణలో కనిపించిన ఆమె చిత్రాలు యువతను ఆకట్టుకుంటూ సామాజిక మాధ్యమాలను కదిలిస్తున్నాయి.

# జానర్ మార్చిన శైలేష్ కొలను

## - రోషన్ మేకతో రొమాంటిక్ కామెడీ ఫస్ట్ గ్లింప్స్ విడుదల


**వేద న్యూస్ డెస్క్:**




యువ హీరో రోషన్ మేక, దర్శకుడు శైలేష్ కొలను కలయికలో రూపొందుతున్న తాజా చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే శీర్షికను చిత్ర బృందం ఖరారు చేసింది. ప్రేమికుల దినోత్సవాన్ని సందర్భంగా చేసుకుని ఈ చిత్రానికి సంబంధించిన మొదటి గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇప్పటివరకు గంభీర నేర కథలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న శైలేష్ కొలను ఈసారి పూర్తిగా భిన్నంగా ప్రేమహాస్య కథను ఎంచుకోవడం విశేషంగా మారింది. విడుదలైన గ్లింప్స్‌లో కథానాయకుడు అభయ్ పాత్రలో కనిపిస్తున్న రోషన్ మేక తన తల్లితో ప్రేమ, నేటి తరం సంబంధాల గురించి చేసే సరదా సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. తేలికపాటి వినోదంతో పాటు భావోద్వేగాలను కలగలిపిన కథగా ఈ చిత్రం ఉండబోతుందనే సంకేతాలు గ్లింప్స్‌లో కనిపిస్తున్నాయి. ఈ సినిమాలో రోషన్ సరసన ప్రీతి ముకుందన్ కథానాయికగా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతాన్ని హేషామ్ అబ్దుల్ వహాబ్ అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా సాగుతుండగా, 2026 దసరా సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నారు.

# 'డీసీ' గ్లింప్స్ విడుదల

**వేద న్యూస్ డెస్క్:**




తమిళ చిత్రసీమలో విభిన్నమైన కథన శైలితో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఇప్పుడు నటుడిగా కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నారు. 'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ' వంటి చిత్రాలతో యాక్షన్ ప్రపంచాన్ని కొత్త దిశగా మలిచిన లోకేష్, ఇప్పుడు 'డీసీ' అనే చిత్రంతో హీరోగా ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ ప్రకటనతోనే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో చిత్రాలను తెరకెక్కించే సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. లోకేష్ సరసన వామికా గబ్బీ కథానాయికగా నటిస్తున్నారు. సంగీత బాధ్యతలను అనిరుధ్ రవిచందర్ చేపట్టడం విశేషం. ఇప్పటికే ఈ కాంబినేషన్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# మీడియాలో ఫుల్ బిజీగా ప్రణీత సుభాష్

**వేద న్యూస్ డెస్క్:**

నటి ప్రణీత సుభాష్ తెలుగు చిత్రసీమలో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు పొందిన కథానాయికగా నిలిచింది. 'ఏం పిల్లో ఏం పిల్లడో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ భామ తొలి చిత్రంతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. సొగసుతో పాటు సహజమైన నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకుని తక్కువ సమయంలోనే మంచి అవకాశాలను అందుకుంది.ఆ తర్వాత నటుడు సిద్ధార్థ్ సరసన నటించిన 'బావ' చిత్రం ఆమెకు మరింత పేరు తీసుకొచ్చింది. ఆ చిత్ర విజయంతో వరుసగా అవకాశాలు రావడంతో ప్రణీత తెలుగు చిత్రాల్లో బిజీగా మారింది. కుటుంబ కథా చిత్రాలు, వినోదాత్మక కథలతో కూడిన సినిమాల్లో నటిస్తూ ప్రేక్షకులకు దగ్గరైంది. అందం, అభినయం రెండింటినీ సమతూకంగా చూపిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. తరువాత కాలంలో పలు భాషల్లో నటించినప్పటికీ, తెలుగులోనే ఆమెకు విశేషమైన ఆదరణ లభించింది. మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, పవన్ కల్యాణ్, రామ్ పోతినేని, మంచు విష్ణు వంటి ప్రముఖ హీరోల సరసన నటించి అభిమానులను అలరించింది. ప్రధాన కథానాయికగా మాత్రమే కాకుండా, కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా స్వీకరిస్తూ తన నటనను చాటుకుంది. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రణీత ఇటీవల చిత్రాలకు కొంత విరామం ఇచ్చింది. వివాహం అనంతరం కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉన్న ఆమె ఇద్దరు పిల్లలకు తల్లిగా కొత్త జీవితాన్ని ఆనందంగా సాగిస్తోంది. అయినప్పటికీ ఆమె ఆకర్షణ, శైలి ఏమాత్రం తగ్గలేదని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. సినిమాలకు దూరంగా ఉన్నా సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో ఎప్పటికప్పుడు అనుసంధానంగా ఉంటోంది. కుటుంబంతో గడిపే క్షణాలు, కొత్త ఫోటోలను పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె పంచుకున్న చిత్రాలు మరోసారి అభిమానుల్లో చర్చకు దారితీసి, సినిమాల్లో తిరిగి ఎప్పుడు కనిపిస్తుందనే ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.



# ఐర్లాండ్ చేతిలో ఒమన్ ఘోర పరాజయం

**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ జట్టు ఒమన్‌పై భారీ విజయం సాధించింది. అన్ని విభాగాల్లో మెరుగైన ప్రదర్శన చేసిన ఐర్లాండ్ జట్టు ప్రత్యర్థిని పూర్తిగా ఆధిపత్యంలో ఉంచి 96 పరుగుల తేడాతో ఘన విజయాన్ని నమోదు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసింది. కెప్టెన్ లోర్కాన్ టక్కర్ అద్భుతంగా ఆడి 51 బంతుల్లో 94 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఆకట్టుకునే షాట్లు ఉండటంతో ఒమన్ బౌలర్లు ఒత్తిడికి గురయ్యారు. గారెత్ డెలానీ వేగంగా పరుగులు సాధిస్తూ జట్టుకు మంచి మద్దతు అందించాడు. చివర్లో జార్జ్ డాక్రెల్ దూకుడుగా ఆడి స్కోరును మరింత పెంచాడు. 236 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ జట్టు ప్రారంభంలో కొంత పోరాడినప్పటికీ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయింది. అమీర్ కలీమ్ అర్ధశతకం సాధించగా, హమ్మద్ మిర్జా 46 పరుగులతో రాణించాడు. అయితే మిగతా బ్యాటర్లు నిలబడలేకపోవడంతో ఒమన్ జట్టు 18 ఓవర్లలో




139 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్‌లో జాషువా లిటిల్ మూడు కీలక వికెట్లు తీసి ఒమన్ బ్యాటింగ్‌ను కుదేలు చేశాడు. సమిష్టి ప్రదర్శనతో ఐర్లాండ్ జట్టు ఈ ప్రపంచకప్‌లో కీలక విజయాన్ని నమోదు చేసుకోగా, ఒమన్ జట్టుకు ఇది గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ విజయంతో ఐర్లాండ్ పాయింట్ల పట్టికలో బలమైన స్థానం సంపాదించింది.

# భారత్‌తో మ్యాచ్‌లో మా తురుపుముక్క అతడే

**వేద న్యూస్ డెస్క్:**




టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం భారత్‌తో జరగనున్న కీలక పోరుకు ముందు పాకిస్థాన్ జట్టు కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో మ్యాచ్‌లో స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్ తమ జట్టుకు తురుపుముక్క అని పేర్కొన్నారు. అతని బౌలింగ్‌పై జరుగుతున్న విమర్శలను ఆయన ఖండించారు. మీడియాతో మాట్లాడుతూ ఉస్మాన్ తారిఖ్ తమకు కీలక బౌలర్ అని, అతని బౌలింగ్ యాక్షన్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి ఇప్పటికే రెండుసార్లు అనుమతించినప్పటికీ అనవసరంగా చర్చ జరుగుతోందని తెలిపారు. ఈ విమర్శలను ఉస్మాన్ పట్టించుకోవడం లేదని, మ్యాచ్‌లో అతను జట్టుకు కీలక పాత్ర పోషిస్తాడని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ ఫామ్‌పై స్పందిస్తూ, అతని ప్రదర్శన తమకు ఎలాంటి ఆందోళన కలిగించడం లేదని స్పష్టం చేశారు. రాబోయే మ్యాచ్‌లో బాబర్ మంచి పరుగులు చేస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచకప్‌లలో భారత్‌పై తమ రికార్డు ఆశించిన స్థాయిలో లేదని సల్మాన్ అంగీకరించారు. గతాన్ని మార్చలేమని, అయితే ఈసారి మెరుగైన ప్రదర్శన చేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

# పాక్‌తో మ్యాచ్ అంటే ఒత్తిడి ఉంటుంది.. షేక్‌హ్యాండ్‌పై ఆలోచిస్తాం..!



**వేద న్యూస్ డెస్క్:**

పొట్టి ప్రపంచకప్‌లో ఆసక్తికర సమరానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఆదివారం రాత్రి భారత్ పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌పై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ హైఓల్టేజ్ పోరులో టాస్ సమయంలో ఇరుజట్ల సారథులు చేతులు కలుపుతారా లేదా అన్న ప్రశ్నపై భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పందిస్తూ ఇంకా సమయం ఉందని, మ్యాచ్ రోజునే నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నాడు. మీడియాతో మాట్లాడిన సందర్భంగా పాకిస్థాన్‌తో మ్యాచ్ అనగానే ఒత్తిడి సహజమని సూర్యకుమార్ చెప్పాడు. రెండు జట్లు తరచూ తలపడకపోవడం వల్ల ప్రతి మ్యాచ్ ప్రత్యేకంగా మారుతుందని తెలిపాడు. అయితే ఇతర మ్యాచ్‌ల మాదిరిగానే దీనిని కూడా సాధారణ ఆటగా తీసుకుని గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతామని స్పష్టం చేశాడు. జట్టులో మార్పులపై మాట్లాడిన సూర్యకుమార్ యాదవ్, ఓపెనర్ అభిషేక్ శర్మ కోలుకున్నాడని, పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో తుది జట్టులో ఉండే అవకాశముందని తెలిపాడు. ప్రత్యర్థి జట్టులోని మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారీఖ్‌పై ప్రత్యేక ప్రణాళికతో బరిలోకి దిగుతామని, విభిన్న శైలిలో బౌలింగ్ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నాడు.భారత్, పాకిస్థాన్ జట్లు రెండేసి విజయాలతో సూపర్ దశకు చేరువలో ఉండటంతో ఈ మ్యాచ్ ప్రాధాన్యం మరింత పెరిగింది. ఐసీసీ టోర్నీల్లో గత రికార్డులు భారత జట్టుకే అనుకూలంగా ఉన్నప్పటికీ ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయబోమని జట్టు వర్గాలు చెబుతున్నాయి. కీలక సమయంలో ఒత్తిడిని జయించిన జట్టుకే విజయం దక్కే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# పదో తరగతి పరీక్షలు రాయనున్న వైభవ్ సూర్యవంశీ

**వేద న్యూస్ డెస్క్:**



అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు పదో తరగతి పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి బోర్డు పరీక్షలకు ఆయన హాజరు కానున్నారు. క్రీడల్లో ప్రతిభ చూపుతూ చదువులోనూ ముందుకు సాగుతున్న ఈ యువ ఆటగాడు మరోసారి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. బీహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్‌లో ఉన్న పోద్దార్ పాఠశాలలో వైభవ్ పరీక్షలు రాయనున్నాడు. అండర్-19 టోర్నమెంట్‌లో తన అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందిన ఆయన ప్రస్తుతం పరీక్షలపై దృష్టి సారించాడు. క్రికెట్‌లో సాధించిన విజయాలతో పాటు చదువును సమానంగా కొనసాగిస్తున్నాడని పాఠశాల వర్గాలు తెలిపాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073